క్లుప్తంగా

శివపార్వతుల కల్యాణోత్సవం


కల్యాణోత్సవంలో స్వామి, అమ్మవారు

పెద్దతిప్పసముద్రం : స్థానిక శివాలయంలో శనివారం శివ, పార్వతుల కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. శివాలయం సేవకులు సనగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో వేద పండితులు ఖన్నాస్వామి.. స్వామి వారి ప్రతిమలకు ప్రత్యేక పుష్పాలతో సుందరంగా అలంకరించి మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల నడుమ కల్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

మహాధర్నాను విజయవంతం చేయండి

గుర్రంకొండ : రాయచోటిలో ఈ నెల 10న నిర్వహించనున్న మహాధర్నా కార్యక్రమంలో పెద్ద ఎత్తున రైతులు పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షులు వెంకట్రమణారెడ్డి, జిల్లా కమిటి సభ్యులు రమేష్ బాబు అన్నారు. శనివారం మండలంలోని టి.రాచపల్లెలో మహాధర్నా కార్యక్రమంపై ఇంటింటా కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రెడ్డెప్ప, అంజన్న, రమణ పాల్గొన్నారు.

12న హుండీ ఆదాయం లెక్కింపు

తంబళ్లపల్లె : మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో ఈనెల 12వ తేదీన బుధవారం హుండీ ఆదాయం లెక్కింపు జరుగుతుందని ఈఓ మునిరాజ, కొండ కిట్ట తెలిపారు. మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులు హుండీ ద్వారా చెల్లించిన కానుకలను లెక్కించడం జరుగుతుందన్నారు.

విద్యా సామగ్రి వితరణ

మదనపల్లె : అన్నమయ్య జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.మౌలాలి ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. స్థానిక ఎస్సీ బాలికల హాస్టల్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్, పెన్నులు, స్కేల్, పెన్సిల్స్, పౌచ్‌లను సివిల్ సప్లయిస్ డీటీ ఎన్.ఫిరోజ్‌ఖాన్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో రఘు, మునిరాజ, బంగారమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మదనపల్లె : పట్టణంలోని 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ గంగాధరం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ కలెక్టర్ కార్యాలయం, ఇందిరానగర్, నక్కలదిన్నె, వేంపల్లె, అమ్మచెరువుమిట్ట, బొమ్మనచెరువు, కోళ్లబైలు, సీటీఎం, పోతపోలు, బసినికొండ సబ్ స్టేషన్‌ల పరిధిలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు 2 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

మండలాభివృద్ధికి సమష్టి కృషి


మాట్లాడుతున్న ఎంపీడీవో సుధాకర్

కేవీపల్లె : మండలాభివృద్ధికి సమష్టి కృషి అవసరమని ఎంపీడీవో సుధాకర్ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఈశ్వరమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు వెంకటరమణారెడ్డి, హరిబాబు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో బీసీలకు అన్యాయం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ బీసీ నేతలు

రామసముద్రం : కూటమి ప్రభుత్వంలో బీసీలకు అన్యాయం జరుగుతోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రటరీ గెవన్న అన్నారు. శనివారం ఆయన స్థానిక బీసీ నాయకులతో కలిసి మట్లవారిపల్లిలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం బీసీ ఓట్ల కోసం సూపర్ సిక్స్‌లో 50 ఏళ్ల పైబడిన బీసీలందరికీ పెన్షన్ మంజూరు చేస్తామని చెప్పిందన్నారు. అయితే చెప్పిన హామీ ఇప్పటి వరకు అమలు చేయకుండా బీసీలకు అన్యాయం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దొరబాబు, నాయకులు నాగప్ప, విజయ్, నారాయణ, గోవిందు, అంబరీష్ తదితరులు పాల్గొన్నారు.

నారీ.. అన్నింటా భేరి


కురబలకోట : అంగళ్లు మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రదర్శన


పీలేరు : సన్మానం పొందిన తలపుల పీహెచ్‌సీ మహిళా సిబ్బంది

మహిళలు అన్ని రంగాల్లోనూ పురుషులతో సమానంగా రాణిస్తున్నారని వక్తలు తెలిపారు. అతివలపై వివక్ష చూపకుండా.. గౌరవించాలని వారు సూచించారు. మదనపల్లె క్లస్టర్ పరిధిలోని మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

మదనపల్లె సిటీ : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పాఠశాలలో పని చేస్తున్న 52 మంది మహిళా ఉపాధ్యాయులకు ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి శాలువాలు కప్పి సన్మానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్‌నాయుడు, నాగరాజ, నాగరాజనాయక్, వరప్రసాద్, అన్వర్, రామచంద్ర పాల్గొన్నారు.

ఉత్తమ మహిళా అవార్డు

మహిళలకు ప్రత్యేకంగా వాహనాల డ్రైవింగ్‌లో శిక్షణ ఇస్తున్నందుకు మదనపల్లెకు చెందిన సాయి డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకురాలు రేణుకకు శనివారం రాయచోటిలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జనార్దనరెడ్డి ఉత్తమ మహిళా అవార్డును అందజేశారు. మదనపల్లె పట్టణానికి చెందిన రేణుక ఇప్పటి వరకు మహిళా ఉద్యోగులు, విద్యార్థులకు ప్రత్యేకంగా వాహనాల డ్రైవింగ్ నేర్పిస్తున్నారు. ఆమె చేసిన సేవలను గుర్తించి అవార్డును ప్రదానం చేశారు. ఆమెకు అవార్డు అందజేయడంపై ఎస్ఐ రమాదేవి, పలువురు అభినందించారు.

ర్యాలీ

కురబలకోట : మండలంలోని అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. అనంతరం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కల్పన తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో..

బి.కొత్తకోట : బి.కొత్తకోట నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ పల్లవి, మేనేజర్ రమాదేవి, ఉద్యోగి సుభాషిణిలను బీజేపీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో రవీంద్ర, ముకుంద, మురళి, నాగరాజు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లె : స్థానిక కేజీబీవీ పాఠశాలలో మహిళా దినోత్సవం ప్రాముఖ్యతను ప్రిన్సిపల్ సుమతి విద్యార్థినులకు వివరించారు. కార్యక్రమంలో మహిళా టీచర్లు పాల్గొన్నారు.

తలపుల పీహెచ్‌సీలో..

పీలేరు : మండలంలోని తలపుల పీహెచ్‌సీలో మహిళా సిబ్బందిని సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ రమేష్‌రెడ్డి, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పీలేరులో మానవ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవం నిర్వహించారు.

కస్తూర్బాగాంధీ విద్యాలయంలో..

కేవీపల్లె : మండలంలోని వగళ్ల కస్తూర్బాగాంధీ గురుకుల విద్యాలయంలో ఎస్ఐ చిన్నరెడ్డెప్ప స్ఫూర్తిదాయకమైన మహిళల గురించి వివరించారు. మదర్‌థెరిస్సా, ఝాన్సీలక్ష్మీబాయి, ఇందిరాగాంధీ, కల్పనా చావ్లా, సరోజినీనాయుడు, కిరణ్‌బేడీ, సానియా మీర్జా, పీవీ సింధు లాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థినులకు సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ లక్ష్మీ, పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా కానిస్టేబుల్‌కు సన్మానం

కలకడ : స్థానిక పోలీస్ స్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్ శోభారాణిని ఘనంగా సన్మానించి ఆమె సేవలను కొనియాడారు. ఇరవై మందికి పైగా పోలీస్ సిబ్బంది స్టేషన్‌లో ఉన్నా అర్ధరాత్రి సమయంలో అయినా.. కన్న బిడ్డలు చిన్నవారైనా వదలి పోలీస్ విధులు ముఖ్యమని పరుగులు తీసిన సందర్భాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కలకడ ఎస్ఐ రామాంజనేయులు, హెడ్‌కానిస్టేబుల్ హరిబాబు, రమేష్, కానిస్టేబుల్ కరుణాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాచవేటివారిపల్లెలో..

నిమ్మనపల్లె : మండలంలోని రాచవేటివారిపల్లె గ్రామంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి శోభ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు మహిళలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 28వ తేదీ వరకు వివిధ చైతన్య కార్యక్రమాలు మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తామని ఆమె పేర్కొన్నారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీవీవీయూ సభ్యులు పాల్గొన్నారు.

రామసముద్రంలో..

రామసముద్రం : రామసముద్రంలో అఖిల భారత రైతు కూలీ సంఘం అధ్యక్షుడు నాగప్ప, మాల మహానాడు మాజీ అధ్యక్షుడు అంబరీష్ ఆధ్వర్యంలో మహిళలను పూలమాలలతో సత్కరించి దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారికి పండ్లు, పూలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నరసింహులు, రామకృష్ణ, బంగారు, మంజు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ మోసాలు ఎండగట్టాలి

తంబళ్లపల్లె : కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, తప్పుడు ప్రచారాలు, ప్రజలకు చేసిన మోసాలను ఎండగట్టాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం తంబళ్లపల్లెలోని తన స్వగృహంలో నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో సమాలోచనలు జరిపారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారాలు, ఎన్నికల మేనిఫెస్టో పేరుతో సూపర్‌సిక్స్ మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేయాలన్నారు. భవిష్యత్తు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీదేనన్న విషయాన్ని అందరూ గుర్తు పెట్టుకోవాలన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తెస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. నూతనంగా ఎంపికైన తంబళ్లపల్లె మండల పార్టీ కన్వీనర్ చౌడేశ్వర్‌ను శాలువాతో ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కరీమ్, ఎంపీటీసీ మహేష్, నాయకులు నరేంద్రరెడ్డి, జయనారాయణరెడ్డి, పీజె వెంకటరమణారెడ్డి, మైనుద్దీన్, కిషోర్‌రెడ్డి, శివారెడ్డి, రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.


పార్టీ కన్వీనర్ చౌడేశ్వర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

వైఎస్సార్‌సీపీ పాలనలో మహిళా సాధికారతకు పెద్దపీట


వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి

మదనపల్లె : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహిళల అభ్యున్నతి, సాధికారతకు పెద్దపీట వేస్తూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేశారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్, వైఎస్సార్ సీపీ మహిళా నాయకులను ఘనంగా సన్మానించారు. కేక్ కట్ చేయించి పంపిణీ చేసి, అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో గిరిజన, దళిత మహిళలను డిప్యూటీ సీఎం, హోం మంత్రి లాంటి పెద్ద పదవులతో గౌరవించారన్నారు. అన్ని రంగాల్లోనూ మహిళలను ప్రోత్సహించి ప్రతి పథకంలోనూ వారికే అగ్రస్థానం ఇచ్చారని పేర్కొన్నారు. మహిళల భద్రత, రక్షణ కోసం దిశ వ్యవస్థను ప్రవేశ పెట్టారన్నారు. నామినేటెడ్ పదవులు, పనుల్లో 50 శాతం మహిళలకే కేటాయిస్తూ తొలిసారిగా చట్టం చేశారన్నారు. రాష్ట్ర చరిత్రలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహిళలకు దక్కినంత గౌరవం, సముచిత స్థానం మరే ప్రభుత్వంలో దక్కదంటే అతిశయోక్తి కాదన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి మాట్లాడుతూ... మదనపల్లె మున్సిపాలిటీ చరిత్రలో తొలిసారిగా చైర్మన్ పదవికి మహిళా చైర్‌పర్సన్‌గా నియమించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజాసేవ చేసే అవకాశం కల్పించినందుకు జీవితాంతం వైఎస్సార్‌సీపీకి, జగనన్నకు రుణపడి ఉంటానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కౌన్సిలర్ సుగుణ, ఎంపీటీసీ నీరుగట్టిమేరీ, అపర్ణ, వైజయంతి, శారదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- పారిశుధ్య కార్మికులకు సమాజంలో ప్రత్యేక స్థానం ఉందని, వారి కారణంగానే పట్టణం, మండలం పరిశుభ్రంగా, ప్రజలంతా ఆరోగ్యంగా ఉండగలుగుతున్నారని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల, ఎంపీడీఓ తాజ్‌మస్రూర్ పాల్గొన్నారు.
- బహుజనసేన రాష్ట్ర అధ్యక్షులు చందు ఆధ్వర్యంలో ఎస్టేట్‌లోని రైజ్ ఆన్ డెనిమ్ ఇండియా ఫ్యాక్టరీలో మహిళా చైతన్య సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భాగంగా సైకాలజిస్ట్ డాక్టర్.రాధిక, ఎస్ఐ శివగామిని, లాయర్ రమాదేవి తదితరులను సన్మానించారు.

బాబు బడ్జెట్ అంకెల గారడీ

- ప్రభుత్వ పథకాలు కేవలం టీడీపీ వారికేనా..?
- సంక్షేమానికి చిరునామా వైఎస్సార్‌సీపీ
- ఈ ఏడాది సూపర్ సిక్స్‌కు ఎగనామం


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్

మదనపల్లె : కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ అంకెల గారడీ అని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ విమర్శించారు. శనివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలను మోసం చేయడమే చంద్రబాబు నైజమనే విషయం బడ్జెట్ ద్వారా మరోసారి నిరూపితమైందన్నారు. సూపర్ సిక్స్ సహా హామీలన్నీ విస్మరించి, పిల్లలు, యువత, మహిళలు, నిరుద్యోగులు, రైతులు ఇలా అన్ని వర్గాలనూ కూటమి ప్రభుత్వం దగా చేసిందన్నారు. తల్లికి వందనం అంటూనే బడ్జెట్‌లో రూ.3 వేల కోట్లకు పైగా కోత పెట్టారన్నారు. ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1,500, నిరుద్యోగ భృతి రూ.3 వేలు అని చెప్పి.. ఎలాంటి కేటాయింపులు చేయకుండా మహిళలను, నిరుద్యోగ యువతను మోసం చేశారన్నారు. పేద, బీసీ వర్గాలంటే చంద్రబాబుకు కడుపుమంటని, అందుకే గత ఏడాది ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిలు నిలుపుదల చేశారని విమర్శించారు. బడ్జెట్ కేటాయింపులు అరకొరగా, స్పష్టత లేకుండా గందరగోళంగా ఉన్నాయన్నారు. అవ్వాతాతలకు, దివ్యాంగులకు ఇచ్చే పింఛన్లు, మహిళలకు ఇచ్చే ఉచిత గ్యాస్ సిలిండర్లలో సైతం కోత విధించారన్నారు. రాష్ట్రంలో 1.48 కోట్ల మంది రేషన్‌కార్డుదారులుండగా బడ్జెట్‌లో కేవలం 90.1 లక్షల మందికే నిధులు కేటాయించారని చెప్పారు. 2019 నుంచి 2024 వరకు ఐదేళ్ల అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలోని ప్రతి హామీని క్యాలెండర్ ప్రకారం అమలు చేశారని గుర్తు చేశారు. ఇటీవల చిత్తూరు జిల్లాలో జరిగిన పెన్షన్ పంపిణీ కార్యక్రమానికి హాజరైన చంద్రబాబు.. టీడీపీ కార్యకర్తల సమావేశంలో వైఎస్సార్‌సీపీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి పథకాలు అమలు చేయవద్దని చెప్పడం ఆయన సంకుచిత మనస్తత్వాన్ని, కుటిలబుద్ధిని తెలియజేస్తోందన్నారు. కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమాన్ని అర్హులందరికీ అందజేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది అయితే... ప్రభుత్వ పథకాలు కేవలం టీడీపీ వాళ్లకే అంటున్న నీచబుద్ధి చంద్రబాబుదని అన్నారు. అందుకే వైఎస్సార్‌సీపీకి చెందిన వారికి సూపర్ సిక్స్ ఎగనామం పెట్టేందుకు... బడ్జెట్‌లో పథకాలకు ఇవ్వాల్సిన కేటాయింపుల కంటే తక్కువ కేటాయింపులు జరిపినట్లు అర్థమవుతోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.ఎ.కరీముల్లా, మునిశేఖర్, ఆర్టీఏ నూర్, కొత్తపల్లె మహేష్, మహమ్మద్ యూనిస్, వైజయంతి, అపర్ణ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి



మాట్లాడుతున్న వాల్మీకి రిజర్వేషన్ సాధనసమితి అధ్యక్షుడు నరసింహులు

మదనపల్లె : వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలంటూ వాల్మీకి, బోయ సంఘాలు 56 ఏళ్లుగా వివిధ రకాలుగా పోరాటాలు సాగిస్తున్నారని వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి అధ్యక్షులు పొదల నరసింహులు అన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మాత్రం వాల్మీకులను మభ్యపెడుతూ గద్దెనెక్కిన తర్వాత ఇచ్చిన హామీని పక్కన పెడుతున్నారని దుయ్యబట్టారు. వాల్మీకి ఎస్టీ సాధనపై పార్లమెంట్, అసెంబ్లీలో మాట్లాడి న్యాయం చేస్తామని ఎన్నికల సమయంలో అభ్యర్థులు హామీలు గుప్పించి, అధికారంలోకి వచ్చాక విస్మరించడం పరిపాటిగా మారిందన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూరరెడ్డి వాల్మీకి సమస్యలపై గళ మెత్తడం, వాల్మీకులను ఎస్టీలో చేర్చాలని మాట్లాడటం హర్షణీయమన్నారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఎమ్మెల్యే, ప్రతి ఎంపీ అసెంబ్లీ, పార్లమెంటు సమావేశాల్లో వాల్మీకుల సమస్యలపై గళమెత్తాలని కోరారు. కూటమి ప్రభుత్వం వాల్మీకులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే, రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పి ఇంటికి సాగనంపుతామని హెచ్చరించారు. సమావేశంలో వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి నాయకులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి వేదిక 'లోక్‌అదాలత్'


మదనపల్లె : బాధిత కుటుంబాలకు ఇన్సూరెన్స్ క్లెయిమ్ చెక్కులను అందజేస్తున్న న్యాయమూర్తులు

మదనపల్లె : కేసుల పరిష్కారానికి వేదికగా లోక్‌అదాలత్ నిలుస్తోందని రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి, మండల్ లీగల్ సర్వీస్ చైర్మన్ అబ్రహం తెలిపారు. శనివారం మదనపల్లి కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కేసులు పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. 2023 జూలైలో జరిగిన ఒక రోడ్డు ప్రమాదానికి సంబంధించిన కేసులో బాధితులకు ద న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ రూ.97 లక్షలు చెల్లించారు. కర్నూలు జిల్లా పగిడిరాయి గ్రామానికి చెందిన పి.అనిల్‌కుమార్ (29) మదనపల్లి సమీపంలోని తెట్టు సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో అర్చకులుగా పని చేస్తున్నారు. అదే గ్రామానికి చెందిన పి.రాఘవేంద్ర (29) కర్నూలు జిల్లా అరిగల్లు సమీపంలో ఉన్న దేవాలయంలో అర్చకుడిగా పని చేస్తున్నారు. వీరిద్దరు 2023 జూలై 28న ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా అనంతపురం జిల్లా ఆత్మకూరు వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అర్చకులు మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులు ఇన్సూరెన్స్ కోసం కోర్టును ఆశ్రయించగా, లోక్ అదాలత్ కార్యక్రమంలో భాగంగా ద న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ అనిల్ కుమార్ కుటుంబానికి రూ.42 లక్షలు, రాఘవేంద్ర కుటుంబానికి రూ.55 లక్షలు ఇవ్వడానికి అంగీకరించడంతో, కేసును మదనపల్లి కోర్టు లో జిల్లా రెండవ అదనపు న్యాయమూర్తి అబ్రహం ఎదుట రాజీ చేసుకున్నారు. బాధితులకు చెందిన చెక్కులను న్యాయమూర్తికి అందజేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ కక్షిదారులను సంతృప్తి పరిచేలా లోక్ అదాలత్ రాజీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ జడ్జ్ వెంకటేష్ నాయక్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటరమణారెడ్డి, కంపెనీ ప్రతినిధులు చంద్రశేఖర్, శివరాం, లీగల్ అడ్వైజర్ స్వర్ణలత, మదనపల్లి బ్రాంచ్ మేనేజర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

87 కేసుల పరిష్కారం

పీలేరు రూరల్ : స్థానిక కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 87 కేసులు పరిష్కారమైనట్లు ఇన్‌చార్జి జిల్లా 11వ అదనపు జడ్జి డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు అన్నారు. వివిధ కోర్టులకు సంబంధించి 85 కేసులు, బ్యాంకులకు సంబంధించి రెండు కేసులు మొత్తం 87 కేసులు పరిష్కారం అయినట్లు ఆయన తెలిపారు. రూ.43,10,895 రికవరీ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి రవి, ఏపీపీ శారద, బార్‌అసోసియేషన్ అధ్యక్షులు బి.సి.పురుషోత్తంరెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె : స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఇన్‌చార్జ్ న్యాయమూర్తి శిరీష్ అధ్యక్షతన జాతీయ లోక్ మోగా లోక్‌అదాలత్ జరిగింది. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జనార్దన్‌రెడ్డి లోక్ అదాలత్ కార్యక్రమం గురించి వివరించారు. సీసీ ఐపీపీ కేసులు 7, ఓఎస్ 2, ఈపీ కేసు 1, ఎస్‌పీసీ అడ్మిషన్లు 140 కేసులను ఇరువర్గాల కక్షిదారుల సమ్మతితో పరిష్కరించారు. కేసులకు సంబంధించి రూ.12,57,933 ప్రాపర్టీ వసూలు చేసి కక్షిదారులకు అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి



మాట్లాడుతున్న ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామచంద్రయ్య

మదనపల్లె : రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో పని చేస్తున్న పారిశుధ్య, ఇతర కార్మికుల సమస్యలను పరిష్కరించి, వారిని పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామచంద్రయ్య డిమాండ్ చేశారు. శనివారం మదనపల్లి మున్సిపల్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 11న మున్సిపల్ వర్కర్స్ చలో విజయవాడ మహాధర్నాకు సిద్ధం కావాలని కోరారు. రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఆప్కాస్ వ్యవస్థను రద్దుచేసి పొరుగు సేవల సిబ్బందిని ప్రైవేటు ఏజెన్సీలకు కట్టబెట్టే చర్యలు మానుకోవాలన్నారు. జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సాంబశివ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దుచేసి ఉద్యోగాలు పర్మినెంట్ చేస్తుందని, ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో అందుకు అనుగుణంగా తీర్మానం చేస్తుందని లక్షలాది మంది కార్మికులు ఎదురు చూశారని, అయితే వారి ఆశలను ప్రభుత్వం నీరుగార్చిందన్నారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మస్తాన్, జిల్లా ట్రెజరర్ దేవేంద్ర, ముబారక్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

యువ రచయితలను ప్రోత్సహించాలి


రచయిత మంజుప్రీతంను సన్మానిస్తున్న రచయితలు

మదనపల్లె సిటీ : స్థానిక ప్రశాంత్‌నగర్‌లోని జ్ఞానోదయ పాఠశాలలో శనివారం యువ రచయిత మంజు పీత్రమ్ రచించిన 'మినీ కలం కవితలు-మనోభావాలు ఎన్నో' కవితా సంపుటిని ఆవిష్కరించారు. ప్రజా చైతన్య స్రవంతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ నవలా రచయిత టీ.ఎస్.ఎ.క్రిష్ణమూర్తి మాట్లాడుతూ గ్రంథ రచయిత తెలుగుభాష మీద ఆసక్తితో సాహితీరంగంలోకి ప్రవేశించారన్నారు. మొదట రచించిన కవితా సంపుటికి మంచి ఆదరణ లభించిందన్నారు. యువ రచయితలను ప్రోత్సహించాలన్నారు. అనంతరం మోహన్‌వల్లి, ధనలక్ష్మి, శకుంతలమ్మ, సరస్వతి, కళావతిలను సన్మానించారు. కార్యక్రమంలో బీటీ కాలేజీ కరస్పాండెంట్ వై.ఎస్.మునిరత్నం, కామకోటి ప్రసాదరావు, ప్రజాస్రవంతి అధ్యక్షులు గొల్లపూడి తిరుపతిరావు, కార్యదర్శి నాగభూషణరావు, మునిగోపాలకృష్ణ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన

మదనపల్లె : ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఎస్ఎస్‌డీసీ), శ్రీనివాస డిగ్రీ కళాశాల సంయుక్త నిర్వహణలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. శనివారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ దాసరి నాగార్జున, కళాశాల డైరెక్టర్.ఎన్.శ్రీనివాసులురెడ్డి మెగా జాబ్‌మేళాను ప్రారంభించారు. 30కి పైగా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. వివిధ రంగాల్లో 2,000కి పైగా ఉద్యోగావకాశాలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ... నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందన్నారు. మెగా జాబ్‌మేళాలో ప్రముఖ కంపెనీలు సైతం తక్కువ జీతాలకు నిరుద్యోగులను ఎంపిక చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. డిగ్రీ విద్యార్థులకు కనీసవేతనం రూ.20 వేలు.. ఆపై ఇచ్చే విధంగా చూడాలని కంపెనీ ప్రతినిధులను ఆదేశించారు. మెగా జాబ్‌మేళాకు 890 మంది నిరుద్యోగులు రిజిస్టర్ చేసుకోగా, 545 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కృష్ణారెడ్డి, వెంకటరమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ పున:ప్రతిష్ట

పెద్దమండ్యం : మండలంలోని వెలిగల్లు పంచాయతీ పాపతాతగారిపల్లెలో శ్రీ పట్టాభి రామాలయ దేవస్థానంలో విగ్రహ ప్రాణ పున:ప్రతిష్ట కార్యక్రమం శనివారం వైభవంగా జరిగింది. పున:ప్రతిష్టా మహోత్సవంలో భాగంగా మూడవ రోజు నిర్వహించిన స్వామివారి కల్యాణోత్సవంలో తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాపతాతగారిపల్లె ప్రజలు ఎమ్మెల్యేకి ఘనస్వాగతం పలికారు. ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు కలిసి మెలిసి ఆలయాన్ని పున:నిర్మించడం పట్ల ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. పల్లెల్లో ఆలయాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గుర్రం రమేష్, సర్పంచ్ సరస్వతి, మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, నాయకులు కుడుం రవి, కొంకల శ్రీనివాసులు రెడ్డి, చింతారపు రెడ్డెప్పరెడ్డి, జింకా వేణుగోపాల్‌రెడ్డి, మధుసూధనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు


శ్రీ గట్టు వెంకటేశ్వరస్వామి

రామసముద్రం : మండలంలోని చెంబకూరు గ్రామంలో వెలసిన శ్రీ గట్టు వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ఈ నెల 21వ తేదీ వరకు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 9వ తేదీ అంకురార్పణ, 10న సూర్యప్రభ వాహనం, 11న సింహ వాహనం, 12న శేష వాహనం, 13న హనుమంత వాహనం, 14న గజ వాహనం, 15న ఎదురుకోలు, కల్యాణోత్సవం, 16న గరుడ సేవ, 16న బ్రహ్మ రథోత్సవం, ధూళి ఉత్సవం, 17న దోపోత్సవం, 18న వసంత మాధవ సేవ, ధ్వజ అవరోహణం, 19న పుష్ప పల్లకి సేవ, 20న పవళింపు సేవ, 21న సుప్రభాత సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వారు వివరించారు.